## జనపథం - జనపదం

*(జనులు నడిచే బాట ... జనులు నుడివే మాట)*

# నాటకరంగం

**- నిత్యానంద్.**

నేను ఉన్నత పాఠశాల విద్యాభ్యాసము చేసే రోజులలో ఆంధ్రవిశ్వవిద్యాలయము నిర్వహించిన నాటక పోటీలను తిలకించే అవకాశము వచ్చింది. ఆ సందర్భములో ఒక చక్కని నాటకము (మీరైతే ఏం చేస్తారు?) చూసే భాగ్యం కలిగింది. అది చూస్తున్నంతసేపూ ఆ నాటకములో పూర్తిగా లీనమైపోయాను. ఆ పాత్రలలో కాఠిన్యం కనబడితే - నాలో ఉద్రేకం కలగడం, శరీరం వేడెక్కడం నాకింకా గుర్తు. సినిమాల ప్రభావం (బుల్లితెర + వెండితెర) వలన వీధి నాటకములకు ఆదరణ తగ్గిన ఈ రోజులలో కళాకారులు జీవనాధారాన్ని కోల్పోయి, ఇతర వృత్తులను చేబడుతున్నారు. అయితే సినిమాలకి, నాటకాలకి ఉన్న ముఖ్యమైన తేడా - నాటకములలో కళాకారులు వేదికపై చేసిన తప్పును సరిదిద్దుకోలేరు, కాని సినిమాలలో 'కట్' ... 'కట్' ... 'రీ టేక్' లు తప్పులను సవరించుకోడానికి అవకాశాన్నిస్తాయి. ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే, ఈనాటి మన అంశమునకు ఇది చాలా అవసరం.

ఆ రోజు నాటకాన్ని పూర్తిగా చూసిన తరువాత బయటికి వస్తూ, ఆ కళాకారులను కలవడం జరిగింది. నాటకంలో కట్టులతో కొట్టుకుని, శత్రుత్వం వహించిన ఇద్దరు ఆజానుబాహులు - ఇప్పుడు భుజాలపై చేతులు వేసికొని మాట్లాడుతుండడం ఆశ్చర్యమనిపించింది. అదే విషయాన్ని వారిని అడిగితే, మాకు దర్శకుడు ఎలా చెప్తే అలా చేసాము. వెనుకనున్న ఆయన కనబడడు. రంగస్థలముపై మేము కనిపిస్తాము అంతే అన్నారు. అప్పుడు అర్థం కాలేదు ... కాని ఆలోచిస్తే

ఆ తెర వెనుక దర్శకుడు (దార్శనికుడు) సృష్టికర్త, సృష్టి భర్త అయిన శ్రీమన్నారాయణుడు కాదా! మనమంతా ఆయన ఆజ్ఞానుసారమే అన్నీ చేస్తున్నము. కాని, మనలో చాల మంది దర్శకుని మరచి, మనమే కర్తలమనుకుని, నాటకాన్ని తప్పుదోవ పట్టిస్తున్నాం. దానిలోని రసాన్ని ఆస్వాదించడం లేదు. ఈ మధ్య ఒక స్నేహితుడు వచ్చాడు. పెళ్ళయిన తరువాత నేను అతనిని విస్మరించానని చాల నిష్ఠురముగా అన్నాడు. చాచిపెట్టి కొట్టాలనిపించింది. అదే వ్యక్తి మూడు సంవత్సరముల క్రితము కలిసినపుడు నీలాంటి స్నేహితుడు ఉండడం నా అదృష్టం అని పొగిడి ఉబ్బేసినపుడు - అలా అలా గాలిలో తేలిపోయాను. వ్యక్తి అతనే అయినప్పటికి, నన్ను పొగుడుతున్నాడా? లేదా తిడుతున్నాడా? అనే దాన్ని బట్టి నా ప్రతిచర్య మారుతున్నది. కాని ప్రపంచమనే నాటకరంగంలో అంతా పాత్రదారులమేనన్న విషయమును ఆ క్షణంలో విస్మరిస్తుంటాము. భరతునికి పట్టాభిషేకము జరిపించాలన్న కోర్కెను కైకలో రగిల్చిన మందర పాత్ర చెడ్డది కాదు. ఆ నిముషములో ఆమె చేసినది దర్శకుని ఆజ్ఞానుసారమే! అది అర్థం చేసుకున్న శ్రీ రామచంద్రుడు మనకు ఆదర్శంకావాలి. ఆ విధముగా తనని అరణ్యవాసానికి పంపడానికి కారణమైనదని రాముడు ఆమెను కోపగించలేదు. ఆమె పాత్రను ఆమె నిర్వహించింది. అదేవిధముగా మననెవ్వరైనా నిందిస్తే అది ఆ పాత్రకు సంబంధించినది. దానిని మనసులో పెట్టుకోకుండా వారిని వారుగా గుర్తించగలిగితే అదే 'వేదాంతధోరణి'. ఈ పాత్రద్వారా 'నిత్యానంద్' అన్న పేరుతో ఈ జీవి ఇచ్చిన ఉదాహరణలు - నా మార్గదర్శి - దర్శకరత్న ఆ శ్రీమన్నారాయణుని ఆజ్ఞానుసారమే జరిగినదని భావిస్తూ - జై శ్రీమన్నారాయణ!

*